చెప్పులు పెట్టిస్తున్నరు

- కావాలనే చెప్పులు పెట్టి ఫొటోలు తీస్తున్నరు
- నిజమైన రైతులెవరూ చెప్పులు పెట్టట్లేదు
- కాంగ్రెస్ కిసాన్ సెల్ నేత కోదండరెడ్డి

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): బాటా కంపెనీలో చెప్పులను లైన్‌గా పెట్టినట్టు విత్తన కేంద్రాల ముందు చెప్పులు పెడుతున్నారని కాంగ్రెస్ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి వ్యాఖ్యానించారు. కృత్రిమంగా చెప్పులు పెట్టి ఫొటోలు తీసి రైతులు పడిగాపులు కాస్తున్నట్టు చిత్రీకరిస్తున్నారని, నిజమైన రైతులెవరూ ఈ విధంగా చేయబోరని అన్నారు. గురువారం గాంధీభవన్‌లో విత్తనాల కొరతపై మాట్లాడుతూ.. విత్తనాల కొరతపై బీఆర్ఎస్ అనవసర రాద్ధాంతం చేస్తున్నదని, రాజకీయం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ఏ కంపెనీ విత్తనాలు అవసరమైతే ఆ కంపెనీ విత్తనాలనే అందించేందుకు ముందుగానే అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. కాంగ్రెస్‌కు రైతులు, వ్యవసాయం విషయంలో అపారమైన అనుభవం ఉన్నదని, అందుకే ప్రభుత్వం ఏర్పడ్డాక రైతుల సంక్షేమం కోసం చకచకా నిర్ణయాలు జరిగాయని వెల్లడించారు. రైతులకు అవసరమైన విత్తనాలను ఆయా జిల్లాల్లో నిల్వ ఉంచి పకడ్బందీగా విత్తనాల సరఫరా చేస్తుంటే బీఆర్ఎస్ దిగజారుడు రాజకీయాలు సరికాదని అన్నారు. కాళేశ్వరం విషయంలో కాంగ్రెస్ ఎప్పుడూ రాజకీయం చేయలేదని, బీఆర్ఎస్ మాత్రం ప్రతి అంశాన్ని రాజకీయం చేస్తున్నదని మండిపడ్డారు. చిహ్నం, గీతం విషయంలోనూ రాజకీయం చేస్తున్నదని దుయ్యబట్టారు. విత్తనాల పంపిణీలో బీఆర్ఎస్ ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో ఉదయం 7 గంటల నుంచి చెప్పులు క్యూలో ఉంచిన రైతులు

ఆదిలాబాద్ పట్టణంలో పత్తి విత్తనాల కోసం రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతులు

రైతన్న విత్తన పోరు

- పత్తి సీడ్స్ కోసం పడరాని పాట్లు
- ఆర్‌సీహెచ్ 369 విత్తనాల కొరత
- స్టాక్ లేదంటున్న వ్యాపారులు
- ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ధర్నా

ఆదిలాబాద్, మే 30(నమస్తే తెలంగాణ): విత్తనాల కొరతే లేదని ఓ వైపు ప్రభుత్వం చెప్తున్నా, రాష్ట్రవ్యాప్తంగా విత్తనాలు దొరక్క అన్నదాతలకు అగచాట్లు తప్పడం లేదు. సరిపడా విత్తనాలు ఉన్నాయంటున్న వ్యవసాయశాఖ మంత్రి ప్రకటనలకు క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతనే లేక రైతుల బారులు, నిరసనలు నిత్యకృత్యమయ్యాయి. ఆదిలాబాద్ జిల్లాలో పత్తి విత్తనాల కోసం గురువారం ఏకంగా రైతులు రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. ఆర్‌సీహెచ్ 659 పత్తి విత్తనాలు లేవని వ్యాపారులు చెప్పడంతో రైతులు స్థానిక పంజాబ్ చౌరస్తాలో రోడ్డుపై 45 నిమిషాలపాటు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రెండురోజులుగా ఒక్కొక్క రైతుకు కేవలం రెండు ప్యాకెట్లతో పోలీసుల బందోబస్తు నడుమ వ్యాపారులు సరిపెడుతున్నారు. విత్తనాలు అందక ఎందరో రైతులు వెనుదిరిగి వెళ్లారు. గురువారం ఉదయం 8 గంటలకే రైతులు భారీ సంఖ్యలో విత్తన దుకాణాలకు చేరుకోగా నిరాశే ఎదురైంది. రైతులకు అవసరమైన ఆర్‌సీహెచ్ 659 విత్తనాలే లేవంటూ వ్యాపారులు చెతులెత్తేశారు. దీంతో ఆగ్రహించిన రైతులు ఆందోళనకు దిగారు. అవసరమైన విత్తనాలు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య, డీఎస్పీ జీవన్‌రెడ్డి అక్కడికి వచ్చి రైతులకు విత్తనాలు పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకుంటామని నచ్చజెప్పగా, రైతులు ధర్నా విరమించారు.

విత్తనాల వ్యాన్‌ను అడ్డుకున్న రైతులు

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ విత్తన దుకాణం నుంచి వ్యాన్‌లో పత్తి విత్తనాలను తరలిస్తుండగా రైతులు అడ్డుకున్నారు. వ్యాపారులు ఆర్‌సీహెచ్ 659 విత్తనాలను తమకు విక్రయించకుండా ఇతర ప్రాంతాల్లోని దుకాణాలకు ఎందుకు తరలిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇక్కడే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్‌కు చెందిన ఓ డిస్ట్రిబ్యూటర్ నుంచి ఇచ్చోడలోని డీలర్‌కు ఈ విత్తనాలు సరఫరా అవుతున్నట్టు అధికారులు గుర్తించారు.

అదే చెప్పుల వరుస

మొయినాబాద్, మే30: పదేండ్ల క్రితం విత్తనాల కోసం అన్నదాతలు పడిన కష్టాలు మళ్లీ ఊరూరా కనిపిస్తున్నాయి. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలో బుధవారం కొంతమందికే విత్తనాలు దొరికాయి. మిగతా వారిని గురువారం రమ్మనడంతో పీఏసీఎస్ ఆఫీసు ఎదుట బారులు తీరారు. ఉదయం 7 గంటల నుంచి చెప్పుల వరుస పెట్టి రైతులు ఎదురుచూశారు. తీరా 9 గంటలకు వ్యవసాయాధికారులు వచ్చి జనములు లేవు కేవలం జీలుగ విత్తనాలే ఇస్తామనడంతో అవసరం ఉన్న వారు తీసుకొని వెళ్లారు. రెండు రోజుల్లో జనుము విత్తనాలు రావొచ్చని మండల వ్యవసాయాధికారి తెలిపారు.

పదేండ్లలో ఇంత అధ్వానం చూడలేదు

నాకు ఎనిమిదెకరాల వ్యవసాయ భూమి ఉన్నది. వానకాలంలో పత్తి సాగు చేస్తా. పత్తి విత్తనాల కోసం నాలుగు రోజులుగా ఆదిలాబాద్‌కు వచ్చిపోతున్నా. ఉమ్మడి రాష్ట్రంలో విత్తనాల కోసం ఇబ్బందులు పడ్డాం. తెలంగాణ వచ్చాక కేసీఆర్ ప్రభుత్వంలో విత్తనాల పంపిణీ సక్రమంగా జరిగింది. ఈ పదేండ్లలో ఇంత అధ్వానం చూడలేదు. ఇప్పుడు మళ్లీ గోస పడాల్సి వస్తున్నది. అవసరమైన కంపెనీల విత్తనాలు దుకాణాల్లో దొరుకుతలేవు. శనివార విత్తనాలు వస్తాయని అధికారులు అంటున్నారు.

- పాచ్చన్న, రైతు, కుచులాపూర్, తలమడుగు మండలం, ఆదిలాబాద్

లోకం పోకడ



ఎందుకు ఖాళీగా ఉంచడం? బార్‌షాప్ పెట్టుకుంటాడట సార్!

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	46.4°c	28.1°c
నల్లగొండ	45.6°c	37.7°c
ఖమ్మం	44.0°c	29.0°c
మెదక్	43.9°c	27.2°c
రంగారెడ్డి	43.0°c	26.5°c
కరీంనగర్	42.0°c	32.0°c
వరంగల్	42.0°c	29.5°c
నిజామాబాద్	41.9°c	30.0°c
మహబూబ్‌నగర్	40.9°c	30.2°c
హైదరాబాద్	40.4°c	29.4°c

పత్తి విత్తనాల సరఫరా సగమే!

మొదటిపేజీ తరువాయి...

మేరకు విత్తనాలు సరఫరా చేయకపోవడమే దీనికి కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తం అవసరమైన విత్తనాల్లో సగం విత్తనాలను మాత్రమే సరఫరా చేసింది. విత్తనాల కోసం గందరగోళం నెలకొన్నా, సీజన్ దగ్గరపడుతున్నా విత్తనాలను క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంచడంలో వ్యవసాయశాఖ విఫలమైందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సరఫరా సగమే

ఈ సీజన్‌లో 60 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇందు కోసం ఎకరానికి రెండు ప్యాకెట్ల చొప్పున 1.26 కోట్ల విత్తన ప్యాకెట్లు అవసరమవుతాయని అంచనా వేసినప్పటికీ ఆ ప్రకారం విత్తన ప్యాకెట్లను క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంచటంలో వ్యవసాయ శాఖ విఫలమైందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.1.26 కోట్ల పత్తి విత్తన ప్యాకెట్లు అవసరం కాగా, ఈ నెల 29 వరకు 51.40 లక్షల ప్యాకెట్లను సరఫరా చేసింది. అంటే ఇంకా 74.6 లక్షల ప్యాకెట్లను రైతులకు అందుబాటులోకి తీసుకురాకపోవటం గమనార్హం. ఆదిలాబాద్‌లో 10.46 లక్షల ప్యాకెట్లు అవసరం కాగా 7.97 లక్షల ప్యాకెట్లనే అందుబాటులో ఉంచింది. పచ్చిరొట్ట విత్తనాలకూ ఇదే పరిస్థితి నెలకొన్నది. మొత్తం 1.41 లక్షల క్వింటాళ్ల విత్తనాలను రైతులకు అందించాలని వ్యవసాయశాఖ నిర్ణయించింది. ఈ నెల 29 వరకు 79,261 క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులో ఉంచినట్టు తెలిపింది. ఇప్పటికే 54,162 క్వింటాళ్ల విత్తనాలను రైతుల కొనుగోలు చేశారు. ప్రణాళిక ప్రకారం ఇంకా 61,739 క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులోకి తీసుకురావాల్సి ఉన్నది. అత్యధిక డిమాండ్ గల జీలుగ విత్తనాలు 1.20 లక్షల క్వింటాళ్లు అవసరమని అంచనా వేయగా, ఇందులో 65,668 క్వింటాళ్ల విత్తనాలనే అందుబాటులో ఉంచింది. ఇప్పటికే 45,412 క్వింటాళ్ల విత్తనాలను విక్రయించారు. ఇంకా 54,332 క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులోకి తీసుకురావాల్సి ఉన్నది.

రైతుకు కావాల్సిన విత్తనాలు లేవు

'అన్నీ ఉన్నాయి.. కానీ మీరు అడిగింది మాత్రం ఇవ్వలేం' అన్నట్టుగా ఉన్నది పత్తి విత్తనాలపై ప్రభుత్వ తీరు. రైతులు డిమాండ్ చేస్తున్న పత్తి విత్తనాలను అందించటంలో ప్రభుత్వం విఫలమైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మార్కెట్లో అనేక కంపెనీల పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. అయినా రైతులు ఒకటి, రెండు కంపెనీలకు చెందిన విత్తనాలనే కోరుకుంటున్నారు. ఆ విత్తనాలకు ప్రభుత్వం సరఫరా చేయలేకపోతున్నది. రైతులు డిమాండ్ చేస్తున్న విత్తనాలను అందుబాటులో ఉంచకుండా, ఇతర విత్తనాలను అందుబాటులో పెట్టి విత్తనాల కొరతే లేదంటూ ప్రకటనలు చేస్తుండటంపై రైతుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్నది.

ప్రణాళిక లోపం

పత్తి, పచ్చిరొట్ట విత్తనాల కొరతకు వ్యవసాయ శాఖ వైఫల్యమే ప్రధాన కారణమన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విత్తనాల అంచనా, సరఫరా ప్రణాళికలో లోపమే ఈ పరిస్థితికి కారణమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సమస్య ఉన్నదని తెలిసినా పరిష్కారానికి చర్యలు తీసుకోవటంలో అధికారుల నిర్లక్ష్యం కూడా రైతులకు శాపంగా మారిందన్న విమర్శలు వస్తున్నాయి. 15 రోజులు కిందటే పచ్చిరొట్ట విత్తనాల సమస్య ఏర్పడింది. అయినా, అధికారులు ఆ సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న వాదనలు వినిపిస్తున్నాయి. అధికారుల చర్యలు లేక సమస్య రోజురోజుకు పెరిగి తీవ్రమైందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

విత్తన సరఫరాలో ప్రభుత్వ విఫలం

ఆదిలాబాద్, మే 30(నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలో విత్తన సరఫరాలో ప్రభుత్వం విఫలమైందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. గత పదేండ్లలో లేని పత్తి విత్తనాల కొరత ఈ ఏడాది వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నది. జిల్లాలో ఈ ఏడాది వానకాలంలో 5.6 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. 4.16 లక్షల ఎకరాల్లోనే పత్తిని పండించనున్నారు. ఇందుకు 10.40 లక్షల విత్తన ప్యాకెట్లు అవసరమవుతాయని గుర్తించారు. జిల్లాలో 511 విత్తన దుకాణాల్లో ఇప్పటివరకు 3.40 లక్షల ప్యాకెట్లనే విక్రయించినట్టు అధికారులు తెలిపారు. గత కొన్నేండ్లుగా ఇక్కడి రైతులు ఆర్‌సీహెచ్ 659 పత్తి విత్తనాలనే ఉపయోగిస్తున్నారు. ఈ విత్తనాల కోసం దుకాణాల వద్ద బారులు తీరుతున్న రైతులకు నిరాశే మిగులుతున్నది. రైతుల డిమాండ్ మేరకు ఆర్‌సీహెచ్ 659 విత్తనాలు పంపిణీ కావడంలేదు. ఈ ఏడాది కంపెనీ నుంచి విత్తనాలు సరఫరా సరిగా లేదని వ్యాపారులు అంటున్నారు. ఇతర కంపెనీ విత్తనాలు కొంటే నష్టపోయే ప్రమాదం ఉందని వాపోతున్నారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లా రైతులకు పత్తి విత్తనాలను సరఫరా చేయడంతో విఫలమైందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అనుమతిలేని విత్తన గోదాం సీజ్

వెల్దుర్తి/ఆదిలాబాద్, మే 30: మెదక్ జిల్లా మాసాయిపేట శివారులో ఉన్న గోదాములో అనుమతులు లేకుండా విత్తనాలను ప్రాసెసింగ్ చేయడంతోపాటు ప్యాకింగ్ చేసి అమ్మకానికి తరలిస్తున్న పరిశ్రమను గురువారం సీజ్ చేసినట్టు మెదక్ జిల్లా మాసాయిపేట మండల ఏవో ఝాన్సీ తెలిపారు. యంత్రాలతోపాటు రూ.6 లక్షల విలువైన 279 క్వింటాళ్ల విత్తన బస్తాలు ఉన్నాయని తెలిపారు. గోదామును సీజ్ చేశామని, యజమానులపై ఫిర్యాదు చేయనున్నట్టు ఏవో ఝాన్సీ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో విత్తనాల సరఫరాలో రైతులకు ఇబ్బందులు సృష్టించారని నిఖిల్ ఫర్టిలైజర్‌కు చెందిన యజమాని రాకేశ్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్టు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. ఆదిలాబాద్ అర్బన్ మండల వ్యవసాయాధికారి రమేశ్ ఫిర్యాదు మేరకు వ్యాపారిపై 420 కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

విత్తనాలు అందించే బాధ్యత కలెక్టర్లదే

మొదటిపేజీ తరువాయి...

సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎక్కడైనా రైతులు ఎక్కువ సంఖ్యలో వస్తే, అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మొత్తం 1.26 కోట్ల ప్యాకెట్లకుగానూ ప్రస్తుతం జిల్లాల వారీగా వివిధ కంపెనీలకు చెందిన 68,16,967 పత్తి విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మిగిలిన ప్యాకెట్లు కూడా జూన్ 5 కల్లా జిల్లాలకు చేరేలా చర్యలు తీసుకోవాలని విత్తన కంపెనీలను ఆదేశించారు. ఆదిలాబాద్‌తో పాటు కొన్ని జిల్లాల్లో రైతులు ఒకే రకమైన విత్తనాలను కోరుకుంటున్నారని, మార్కెట్లో లభ్యమవుతున్న ప్రతి విత్తన హైబ్రిడ్ల దిగుబడి ఒక్కటేనన్న అంశంపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అన్ని జిల్లాలలో అవసరం మేరకు పత్తి, పచ్చిరొట్ట విత్తనాలు ఉన్నాయని, రైతులెవరూ ఆందోళన చెందకుండా అవసరం మేరకు విత్తనాలను కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

విత్తనాలివ్వలేని అసమర్థ ప్రభుత్వం

- మంత్రి తుమ్మల చెప్పే మాటలకు క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతన లేదు
- సీఎం మంత్రులకు సమన్వయం లేదు
- రాష్ట్రంలో విత్తనాలు, ఎరువుల లభ్యతపై సర్కారు శ్వేతపత్రం విడుదల చేయాలి
- మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కనీసం రైతులకు విత్తనాలు సక్రమంగా సరఫరా చేయలేని అసమర్థ ప్రభుత్వం ఉన్నదని మాజీ మంత్రి జోగు రామన్న మండిపడ్డారు. రైతు సమస్యలను రేవంత్ సర్కారు గాలికి వదిలేసిందని విమర్శించారు. విత్తనాలు, ఎరువుల లభ్యతపై ప్రభుత్వం శ్వేతపత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఆరు నెలలపాలనలో రైతులు ఆగమయ్యారని, రాష్ట్రంలో విత్తనాల కొరత లేదని వ్యవసాయ మంత్రి తుమ్మల అబద్ధాలు చెప్తున్నారని మండిపడ్డారు. తుమ్మల చెప్పే మాటలకు క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతనే లేదని చెప్పారు. రైతు సమస్యలపై సర్కారుకు సరైన అవగాహన లేదని, సీఎం మంత్రుల మధ్య సమన్వయం లేదని విమర్శించారు. గురువారం తెలంగాణభవన్‌లో ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, ఖానాపూర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆదిలాబాద్ జిల్లాలో విత్తనాల కోసం వచ్చిన రైతులపై లాఠీచార్జి చేయడం అమానుషమని, ప్రభుత్వానికి సిగ్గుచేటని విమర్శించారు. రైతులకు ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పదేండ్లలో రైతులకు ఇలాంటి కష్టాలు ఎప్పుడూ రాలేదని గుర్తుచేశారు. ప్రభుత్వ చేతకానితనం వల్లే విత్తనాలు అందక రైతులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఆదిలాబాద్ జిల్లాలో 4.20 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తారని, గతంలో తాము 1.20 లక్షల ప్యాకెట్లు అందుబాటులో ఉంచామని, కానీ ఈ సారి 40-50 వేల ప్యాకెట్లు ఉన్నాయని తెలిపారు. రెండు మూడు రోజుల్లో రైతులు అడిగిన విత్తనాలు అందుబాటులో ఉంచకపోతే జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. రైతులు అడిగిన విత్తనాల రకాలనే అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. విత్తనాల లభ్యతపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చామని జోగు రామన్న చెప్పారు.

రైతుల గురించి సీఎంకు పట్టింపులేదు

సీఎం రేవంత్‌రెడ్డికి ఎపుడూ రైతుల గురించి పట్టింపే లేదని జోగు రామన్న విమర్శించారు. రేవంత్ అప్పుడు ఐపీఎల్ మ్యాచ్‌లో, ఇపుడు అధికార చిహ్నాలు మార్చడంలో బిజీగా ఉన్నారని మండిపడ్డారు. ఉపముఖ్యమంత్రి భట్టి రాష్ట్ర సమస్యలు వదిలేసి వేరే రాష్ట్రాల్లో ప్రచారానికి వెళ్తున్నారని విమర్శించారు. రైతులు మళ్లీ కమీషన్ ఏజెంట్లను ఆశ్రయించడమే ఇందిరమ్మ రాజ్యమా? రైతులను ఇబ్బంది పెట్టడమే మార్పా? అని నిలదీశారు. మంత్రి జూపల్లికి తన శాఖలో ఏం జరుగుతున్నదో తెలియకపోవడం శోచనీయమని మండిపడ్డారు. సీఎంకు వసూళ్ల మీద ఉన్న శ్రద్ధ రైతుల బాగోగుల మీద లేదని విమర్శించారు. వర్షాకాలం సాగునీటి విడుదలపై ప్రభుత్వానికి ఓ కార్యాచరణ లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 250 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, కేసీఆర్ రైతుల పట్ల చూపిన శ్రద్ధలో రేవంత్ పదిశాతం పెట్టినా ఇన్ని సమస్యలు వచ్చేవి కావని చెప్పారు. రైతు సమస్యలపై సీఎం రేవంత్ ఎందుకు నోరు మెదపరని నిలదీశారు. రైతు భరోసా ఎప్పట్నుంచి వేస్తారో సీఎం చెప్పాలని డిమాండ్‌చేశారు.

- మేడిగడ్డ బరాజ్‌లో మరమ్మతులు

మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్‌లో మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. ఎన్‌డీఎస్‌ఏ సూచన మేరకు వానకాలంలో వరద ఉధృతి వల్ల బరాజ్‌కు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యల్లో భాగంగా దెబ్బతిన్న పిల్లర్ల వద్ద అప్, డౌన్ స్ట్రీమ్ ఏడు, ఎనిమిదో బ్లాకుల్లో పనులు చేపడుతున్నారు. ఏడో బ్లాక్ వద్ద వరద నీరు రాకుండా ఉండేందుకు మట్టికరకట్ట పనులు జరుగుతున్నాయి. ఏడో బ్లాక్‌లో కుంగిన 19, 20, 21 పియర్ల ప్రదేశాల్లో ఏర్పడ్డ ఖాళీ ప్రదేశాలను సిమెంట్, ఇసుకతో పూడ్చేందుకు చేసే గ్రౌటింగ్ కోసం యంత్రాలు, మెటీరియల్‌ను నిర్మాణ సంస్థ సిద్ధం చేసింది. బరాజ్‌లో నిర్వహిస్తున్న పనులను భారీ నీటిపారుదల శాఖ ఈఈ తిరుపతిరావు గురువారం పర్యవేక్షించి పనుల పురోగతిపై సంస్థ ప్రతినిధులతో చర్చించారు. బరాజ్ దిగువన కుంగిన పియర్ల ప్రాంతంలో కాపర్ షీట్‌పైల్స్‌ను అమర్చుతున్నారు. 20, 21 గేట్ కట్టింగ్ పనులు, వరద ప్రవాహానికి అడ్డుగా ఉన్న ఇసుకను తొలిగిస్తున్నారు. డౌన్‌స్ట్రీమ్‌లో భారీ క్రేన్ల సాయంతో సీసీ బ్లాక్ అమరిక పనులు జరుగుతున్నాయి. - మహదేవపూర్

తెలంగాణ గ్రోత్ ఇంజిన్ కాళేశ్వరం

- ప్రాజెక్టుతోనే పుష్కలంగా సాగు, తాగునీరు
- పెరిగిన పంటల దిగుబడి, చేపల ఉత్పత్తి
- సత్వరమే పునరుద్ధరణ పనులు చేపట్టాలి
- తెలంగాణ వికాస సమితి విజ్ఞప్తి

హైదరాబాద్, మే30 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ గ్రోత్ ఇంజిన్ అని తెలంగాణ వికాస సమితి వెల్లడించింది. ప్రాజెక్టు ద్వారానే రాష్ట్రంలో పుష్కలంగా సాగు, తాగునీరు అందుబాటులోకి వచ్చిందని, పంటల దిగుబడి, చేపల ఉత్పత్తి పెరిగి రాష్ట్ర ఆదాయం పెరిగిందని స్పష్టం చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్రానికి లైఫ్‌లైన్ అని అభివర్ణించింది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు పునరుద్ధరణ పనులను సత్వరమే చేపట్టేలా చూడాలని న్యాయవిచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్‌కు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు విజ్ఞాపన పత్రాన్ని బీఆర్కే భవన్‌లో ఏర్పాటు చేసిన బాక్సులో తెలంగాణ వికాస సమితి అధ్యక్షుడు అర్రోజు శ్రీనివాస్ గురువారం దాఖలు చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు రాష్ట్రమంతా కరువు ఉండేదని, ప్రత్యే రాష్ట్ర ఉద్యమ నినాదాల్లో సాగు, తాగునీరు కూడా ఒకటని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర రైతాంగం, ప్రజానీకం నీటి అవసరాలను తీర్చడమే ధ్యేయంగా ప్రపంచంలోనే అతిపెద్ద, మల్టీ స్టేజ్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ కాళేశ్వరాన్ని చేపట్టిందని గుర్తుచేశారు. అమెరికాలోని హూవర్ డ్యామ్, ఈజిప్ట్‌లోని అశ్వాన్‌డ్యామ్, చైనాలోని త్రిగోర్జెస్ డ్యామ్‌ల నిర్మాణం తరువాత ఆయా దేశాల ఆర్థికవ్యవస్థల్లో ఎలాంటి పెను మార్పులు సంభవించాయో, అదే తరహాలోనే కాళేశ్వరం నిర్మాణం తరువాత తెలంగాణ సామాజిక జీవనంలో పెనుమార్పులు చోటు చేసుకున్నాయని వివరించారు. ప్రాజెక్టు నిర్మాణం తరువాత గోదావరి జలాల వినియోగం 472టీఎంసీల నుంచి 739టీఎంసీలకు 56శాతం పెరిగిందని, భూగర్భజలాల తోడివేత 58శాతం నుంచి 39శాతానికి తగ్గిపోయిందని, భూగర్భజలమట్టం 4మీటర్లు పెరిగిందని గుర్తుచేశారు. విశ్వనగరం హైదరాబాద్ సిటీ తాగునీటి అవసరాలను తీర్చడంలోనూ కాళేశ్వరం ప్రాజెక్టు కీలకభూమికను పోషిస్తున్నదని వెల్లడించారు.

కాళేశ్వరంపై బీఆర్‌కే భవన్‌లో ఏర్పాటు చేసిన బాక్సులో విజ్ఞాపన పత్రాన్ని వేస్తున్న టీవీఎస్ అధ్యక్షుడు అర్రోజు శ్రీనివాస్

పంట విస్తీర్ణం 2.98కోట్ల ఎకరాలకు..

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం తరువాత రాష్ట్రంలో పంటల సాగు విస్తీర్ణం 81.6శాతం పెరిగిందని వెల్లడించారు. 2014లో 1.31కోట్ల ఎకరాలు ఉండగా, అది 2022-23నాటికి 2.38కోట్లకు పెరిగిందని, వరి దిగుబడి 68లక్షల టన్నుల నుంచి 3కోట్ల టన్నులకు చేరుకున్నదని తెలిపారు. 2014 నుంచి మొత్తంగా 1.33లక్షల కోట్ల విలువైన 722.92లక్షల టన్నుల వరిధాన్యాన్ని ప్రభుత్వం సేకరించిందని, దాదాపు 11.439.6కోట్ల విలువైన ఇతర పంట ఉత్పత్తులను సేకరించిందని గణాంకాలను తెలంగాణ వికాస సమితి ఉదహరించింది. రాష్ట్రంలో చేపల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని, 6వేల కోట్ల విలువైన ఉత్పత్తిని సాధించిందని గుర్తుచేశారు.

ప్రాజెక్టును సత్వరమే పునరుద్ధరించాలి..

కాళేశ్వరం ప్రాజెక్టుతో బహుళ ప్రయోజనాలు దాగి ఉన్నాయని వివరించారు. ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ బరాజ్‌ను వెంటనే పునరుద్ధరించేలా రాష్ట్ర అధికారయంత్రాంగానికి ఆదేశాలు జారీ చేయాలని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు తెలంగాణ వికాస సమితి అధ్యక్షుడు అర్రోజు శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. వచ్చే వానాకాలం నాటికి ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకువచ్చేలా చూడాలని కోరారు.

10లోగా రాష్ట్రానికి నైరుతి

- కేరళ ను తాకిన రుతుపవనాలు
- హైదరాబాద్ వాతావరణ శాఖ

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర రైతులకు, ప్రజలకు హైదరాబాద్ వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. జూన్ 10లోగా నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొన్నది. నైరుతి రుతుపవనాలు గురువారం ఉదయం కేరళ తీరాన్ని తాకాయని వాతావరణ కేంద్రం తెలిపింది. లక్షద్వీప్ మీదుగా రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించాయని చెప్పింది. కర్ణాటక, తమిళనాడులోని కొన్ని భాగాలు, నైరుతి, మధ్య బంగాళాఖాతం,పశ్చిమ బెంగాల్, సిక్కింలోని పలు ప్రాంతాల్లోకి రాబోయే రెండు మూడు రోజుల్లోనే విస్తరిస్తాయని వాతావరణశాఖ పేర్కొన్నది. నాలుగు రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌కు, జూన్ 10 లోగా తెలంగాణకు రుతుపవనాలు చేరుకుంటాయని వాతావరణ శాఖ అధికారి డాక్టర్ శ్రావణి తెలిపారు. జూన్ 11 వరకు రాష్ట్రమంతటా విస్తరిస్తాయని వెల్లడించారు. రాష్ట్రంలో జూన్ 1 నుంచి మూడురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

కేరళతో పాటు ఈశాన్య రాష్ట్రాలకూ...

కేరళతో పాటు ఈశాన్య రాష్ట్రాలకు కూడా రుతుపవనాలు విస్తరించాయి. సాధారణంగా జూన్ 1న కేరళను రుతుపవనాలు తాకుతాయి. తర్వాత జూన్ 5న ఈశాన్య రాష్ట్రాలకు విస్తరిస్తాయి. అయితే, రుతుపవనాలు వచ్చే సమయంలోనే బంగాళాఖాతంలో ఏర్పడ్డ రెమాల్ తుఫాను ప్రభావంతో ఈశాన్య రాష్ట్రాలకు ముందుగానే రుతుపవనాలు చేరాయి. ఇ